క్లుప్తంగా

శివాలయానికి భూమిపూజ



ఆలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు గ్రామంలో పునఃనిర్మించే ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయానికి సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు భూమిపూజలో పాల్గొన్నారు. కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు హాజరయ్యారు.

'రవళి'లో ఈఎస్ఐ వైద్య శిబిరం

పెరవలి: మండలంలోని ఖండవల్లి గ్రామంలోని రవళి స్పిన్నింగ్ మిల్లు ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఈఎస్ఐ వైద్య బృందం ఇక్కడకు వచ్చి 340 మంది కార్మికులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసింది. వారిలో అవసరమైన 225 మందికి ఉచితంగా ఆ స్పిన్నింగ్ మిల్లు మేనేజింగ్ డైరెక్టర్ వంక రాజకుమారి చేతుల మీదుగా మందులు అందజేశారు. ఉన్నత వైద్యం అవసరమైన 16 మంది కార్మికులను తణుకు పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. వైద్య శిబిరంలో ఈఎస్ఐ వైద్యులు సింహాద్రి, ఎంఎం హుస్సేన్, జగదీష్ తదితరులు సేవలు అందించారు.

స్పందనకు ఏడు అర్జీలు

కొవ్వూరు: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఏడు అర్జీలు అందాయని ఇన్‌చార్జ్ ఆర్డీవో రామావత్ కృష్ణ నాయక్ తెలిపారు. కుమారదేవంలో తనకున్న పొలానికి సర్వే చేయించి ఆక్రమణదారుల నుంచి రక్షించాలని చిడిపి గ్రామానికి చెందిన ఉప్పులూరి శ్రీహరిరావు కోరారు. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట ఎస్సీ ఏరియాలో సిమెంట్ రోడ్డు నిర్మించాలని ఆ ప్రాంతానికి చెందిన మెరిపే శ్రీను కోరారు. తన భూమికి సర్వే చేయించాలని చాగల్లు మండలం మార్కొండపాడుకి చెందిన బండి వెంకట రామరావు అర్జీ అందజేశారు. తనకు ఇంటి స్థలం ఇప్పించాలని దేవరపల్లి మండలం గొల్లగూడేనికి చెందిన మద్దుల నాగ దుర్గాభవానీ దరఖాస్తు అందజేశారు. వేములూరు గ్రామంలోని స్కూల్ వద్ద ఆక్రమణలను తొలగించాలని గొల్లపల్లి శ్రీను కోరారు. డీఎల్‌డీవో వి.శాంతామణి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: జిల్లాలోని ఏపీ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి ఎం.సనత్‌కుమారి సోమవారం తెలిపారు. ఫార్మసిస్టు గ్రేడ్-2 ఒక పోస్టు, ఆడియో మెట్రీషియన్ ఒక పోస్టును భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను వెస్ట్ గోదావరి.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 28వ తేదీ నుంచి డిసెంబర్ 4వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ప్రాంగణంలోని తమ కార్యాలయం(డీసీహెచ్ఎస్)లో అందజేయాలని సూచించారు.

పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటుపై వివాదం

ఉండ్రాజవరం: మండలంలో తాడిపర్రు గ్రామంలోని వివాదాస్పద స్థలంలో ఆదివారం అర్ధరాత్రి సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వివాదాస్పదం అయ్యింది. దాంతో స్థానిక ఎస్సై కె.రామారావు ఆధ్వర్యంలో భారీగా పోలీసులు ఆ గ్రామానికి చేరుకున్నారు.అక్కడి నుంచి విగ్రహాన్ని తొలగించేందుకు పోలీసులు ప్రయత్నించగా గౌడ మహిళలు అడ్డుకున్నారు. విగ్రహాన్ని తొలగిస్తే ఆత్మాహుతికి పాల్పడతామంటూ పెట్రోలు క్యాన్లతో మహిళలు నిరసనకు దిగారు. దాంతో జిల్లా స్థాయి అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు చేశారు. వివాదాస్పద స్థలంలో విగ్రహ ఏర్పాటు సరికాదంటూ విగ్రహానికి ముసుగు వేయించారు. ముసుగు తొలగించాలని మహిళల ఆందోళన సోమవారం తెల్లవారుజాము నుంచి కొనసాగుతోంది. గ్రామంలో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కొవ్వూరు ఇన్‌చార్జి ఆర్డీవో ఇన్‌చార్జ్ రామావత్ కృష్ణ నాయక్, ఎస్పీ జగదీష్, డీఎస్పీ వర్మలు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు.

కౌన్సిల్‌లో డంపింగ్ యార్డు దుమారం

- అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం
- రసాభాసగా మునిసిపల్ సమావేశం
- అజెండాలోని 32 అంశాలకూ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి



సమావేశంలో అధికార,విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం

కొవ్వూరు: డంపింగ్ యార్డు సమస్య కొవ్వూరు మునిసిపల్ సాధారణ సమావేశంలో దుమారం రేపింది. అధికార, విపక్షాల మధ్య మాటల తూటాలు పేల్చింది. సమావేశం రసాభాసగా మారింది. సోమవారం నిర్వహించిన సమావేశానికి చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షత వహించారు. బైపాస్ రోడ్డుకు ఇరువైపులా వేసిన చెత్తను జేసీబీల సాయంతో తొలగించాలన్న అజెండాలోని 27వ అంశం వివాదానికి కారణమైంది. ఇక్కడి వ్యర్థాల తొలగింపునకు రూ.2.60 లక్షలు కేటాయించడంపై విపక్షానికి చెందిన ఒకటో వార్డు సభ్యుడు బొండాడ సత్యనారాయణ అభ్యంతరం తెలిపారు. మునిసిపాలిటీకి దీర్ఘకాలంగా ఉన్న డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించకుండా చెత్త తొలగింపునకు నిధులు కేటాయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించడంలో అధికార పార్టీ చిత్తశుద్ధిని ఆయన తప్పుబట్టారు. దీంతో సమావేశంలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. సమస్య పరిష్కారానికి సలహాలు ఇవ్వకుండా విమర్శలకే బొండాడ ప్రాధాన్యం ఇవ్వడాన్ని కో- ఆప్షన్ సభ్యుడు ఏలూరి వెంకట్ తప్పుబట్టారు. ఈ దశలో సభలో ఇరు పక్షాల సభ్యులు వాదులాటతో సమావేశం దద్దరిల్లింది. దశాబ్దాలుగా డంపింగ్ యార్డు సమస్య ఉండగా, ప్రస్తుత పాలకవర్గంపై నిందలు వేయడాన్ని అధికార వైఎస్సార్ సీపీ సభ్యులు కంఠమణి రమేష్, వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు ఆంజనీదేవి, రుత్తల భాస్కరరావు అభ్యంతరం తెలిపారు. దీంతో సీనియర్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ జోక్యం చేసుకున్నారు. డంపింగ్ యార్డు ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందో విపక్ష సభ్యులు సూచనలిస్తే స్వీకరిస్తామని, అందుకు భిన్నంగా విమర్శలు చేయడం సరి కాదన్నారు. గోదావరి పుష్కరాల సమయంలో రూ. వందల కోట్ల నిధులు వచ్చినప్పటికీ అప్పట్లో డంపింగ్ యార్డు సమస్యను టీడీపీ పాలకవర్గం ఎందుకు పరిష్కరించ లేకపోయిందని ప్రశ్నించారు. గతంలో చెత్త డంపింగ్ చేసే ప్రదేశాన్ని పోలీసు స్టేషన్ నిర్మాణానికి ఎందుకిచ్చారని బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీ కృష్ణ ప్రశ్నించారు. చెత్త రీసైకింగ్ పేరుతో నిధులను వెచ్చించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఐ.పంగిడిలో డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలాన్ని ఇప్పటికీ వినియోగించుకోలేక పోతున్నామన్నారు.

కౌన్సిల్ ఆమోదం మేరకే..

ఈ తరుణంలో చైర్ పర్సన్ బావన రత్నకుమారి స్పందించారు. కౌన్సిల్ ఆమోదం మేరకే ప్రభుత్వ స్థలాన్ని పోలీసు స్టేషన్ భవనానికి ఇచ్చామని ప్రకటించారు. కమిషనర్ బి. శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 22 మునిసిపాలిటీల్లో డంపింగ్ యార్డు సమస్య ఉందన్నారు. ప్రభుత్వం స్థలం అందుబాటులో లేనందునే కొవ్వూరు మునిసిపాలిటీకి ఈ సమస్య ఏర్పడిందన్నారు. ఐ.పంగిడిలో కేటాయించిన స్థలంలోకి వ్యర్థాలను డంపింగ్ చేయబోగా, ఆ గ్రామస్తులు ప్రతిఘటించడంతో వీలుకావడం లేదన్నారు. తీవ్ర తర్జన, భర్జనలు అనంతరం చెత్త ఎక్కడ వేస్తే బాగుంటుందో సభ్యులు సూచిస్తే బాగుంటుందని కోడూరి శివరామకృష్ణ సూచించారు. దీనికి విపక్ష సభ్యుల నుంచి సమాధానం రాలేదు. పలు వార్డులో తాగునీటి సమస్య ఉన్నందున ముందస్తుగా వివరాలు సేకరించి వేసవి కార్యాచరణ ప్రణాళికలో పెట్టాలని కౌన్సిలర్ కంఠమణి రమేష్ కోరారు. 15వ వార్డులో మెయిన్ పైప్‌లైన్‌కు 30 కుళాయి కనెక్షన్లు ఇవ్వడంతో 15,16 వార్డులకు తాగునీటి సమస్య ఏర్పడిందని కౌన్సిలర్ చీరా అరుణ వాపోయారు. వీధిలైట్లు వెలగడం లేదని, స్కూల్ల బోరు మోటార్ పాడైందని మరో సభ్యుడు ఆర్.రామారావు సమావేశం దృష్టికి తెచ్చారు. తాగునీటి వసతి సమస్య వల్ల జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు ఆలస్యం అవుతున్నాయని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రమేష్ కోరారు. అనంతరం అజెండాలో ప్రతిపాదించిన 32 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

చెక్కుల అందజేత

నిడదవోలు: వైద్య సహాయం నిమిత్తం పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన నలుగురికి ముఖ్యమంత్రి సహాయక నిధి నుంచి రూ.3.50 లక్షలు మంజూరయ్యారు. ఈ మొత్తానికి చెక్కులను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సోమవారం నలుగురు లబ్ధిదారులకూ అందజేశారు.

'మానవత' సంస్థకు రూ.25 వేల విరాళం

నల్లజర్ల: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖకు నల్లజర్లకు చెందిన దివంగత నవులూరి చంద్రశేఖర్ భార్య విజయలక్ష్మి రూ.25 వేలు విరాళంగా సోమ వారం అందజేశారు. ఆమె ఈ మొత్తాన్ని మానవత సంస్థ జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణకు అందజేసారు. మానవత సభ్యు లు ఆమెకు ధన్యవాదాలు తెలిపి, జ్ఞాపిక అందజేశారు.

విద్యార్థిని ఫీజుకు ఆర్థిక సాయం

చీపురుగూడేనికి చెందిన చెల్లు సుబ్రహ్మణ్యం కుమార్తె సింధు తనయశ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతోంది. ఆమె కళాశాల ఫీజు నిమిత్తం సోమవారం మానవత సంస్థ రూ.10 వేల ఆర్థిక అందజేసింది. కార్యక్రమాల్లో మానవత సంస్థ జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, భోగవల్లి వెంకట సుబ్బారావు, గుత్తికొండ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

- ఆరికిరేవులలో మంత్రి తానేటి వనిత, మోర్తలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు గడప గడపకూ..



ఆరికిరేవులలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత



మోర్తలో మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

కొవ్వూరు: కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రతి కుటుంబానికీ మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రజలను కోరారు. మండలంలోని ఆరికిరేవుల గ్రామంలో సోమవారం ఉదయం , సాయంత్రం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి వీలుగా అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరికరేవుల సర్పంచ్ మట్టా శ్రీనివాస్, ఉప సర్పంచ్ మల్లిపూడి వెంకట్రావు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న , పార్టీ స్థానిక నాయకులు చావా దామోదరరావు, యనమదల సూరిబాబు, మల్లిపూడి రాజేష్, రంబాల అన్నవరం, మల్లిపూడి శ్రీనివాస్, మట్టా వెంకట్రావు, దిద్దే వెంకట్రావు పాల్గొన్నారు.

సమస్యలు వింటూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

ఉండ్రాజవరం: పార్టీ భేదాలు, కులమతాలు చూడకుండా అర్హులందరికీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తున్నామని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని మోర్త పంచాయతీ పరిధిలోని చింతలపేట, గీతామందిరం సెంటర్, కాపుల వీధుల్లో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్ర ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సమస్యలు తెలుసుకుంటూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యల సమస్యల పరిష్కారానికి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటింటికీ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించి, ఆయా కుటుంబానికి ఎంతమేర సహాయం అందిందో వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, సర్పంచ్ చిటికెన సుజని, ఎంపీటీసీ సభ్యురాళ్లు జానీ నాగలక్ష్మి, వెలిగెట్ల రాణి, వైస్ ప్రెసిడెంట్ దావర్తి రామ సందీప్, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిటికెన సూరిబాబు, కంటిపూడి సూర్యచంద్రరావు, కంటిపూడి మోహన్‌రావు, కొనకళ్ల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గతేడాదితో పోలిస్తే తగ్గిన రోడ్డు ప్రమాదాలు

- పూర్తిగా నివారించే లక్ష్యంతో కార్యాచరణ
- కొవ్వూరు-నల్లజర్ల మధ్య 35 బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు
- జిల్లా ఎస్పీ జగదీష్ వెల్లడి



నల్లజర్ల వద్ద తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

నల్లజర్ల: తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి తగు చర్యలు తీసుకోవడంతో గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం చాలా వరకూ ప్రమాదాలు తగ్గాయని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. తాజాగా తీసుకునే చర్యలతో ప్రమాదాలు జరగకుండా చేయాలన్నదే తమ లక్ష్యం అన్నారు. నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు నుంచి నల్లజర్ల మండలం శివారు వరకూ 35 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాద సూచిక బోర్డులు, లైటింగ్, వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని నల్లజర్ల సీఐ నున్న రాజును ఆదేశించారు. పుల్లలపాడు వద్ద హైవేపై కటింగ్ ఇవ్వడం వల్ల ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి ప్రసాద్ ఎస్పీకి వివరించారు. అన్ని గ్రామాలకూ ఫ్లై ఓవర్లు ఏర్పాటు చేసి, ఇక్కడ వేయక పోవడం వల్ల ఈ ప్రాంత వాసులు నాలుగు కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందన్నారు. నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో మాట్లాడి ఈ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ బదులిచ్చారు. అనంతపల్లిలో ఆగస్టులో సంభవించిన ఒకే ప్రమాదంలో ఏడుగురు వ్యక్తులు చనిపోయిన ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించారు. బైపాస్ రహదారిపై ఎక్కడా వాహనాలు నిలపడానికి వీల్లేదని, ఎవరైనా ఆపితే తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఎస్పీతో పాటు నల్లజర్ల సీఐ నున్నరాజు, ఎస్ఐ నరసింహమూర్తి, రహదారి కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధి అఖిల్ ఉన్నారు.

వార్డుల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తా

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



నిడదవోలు ఎస్టీ కాలనీలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: ప్రభుత్వం నుంచి తగినన్ని నిధులను మంజూరు చేయించి, పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ మౌలిక సదుపాయాలు మెరుగు పరుస్తామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు చెప్పారు. సోమవారం ఆయన పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.16వ వార్డు గాంధీనగర్‌లో రూ.11.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అదే వార్డులో రూ.10 లక్షలతో నిర్మించే డ్రైనేజీకి శంకుస్థాపన చేశారు. 17వ వార్డు సుబ్బరాజుపేటలో రూ.11 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.10 లక్షలతో మున్సిపల్ స్కూల్ వద్ద నిర్మించిన నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.అలాగే 20 వార్డు ఎంవీనగర్‌లో రూ.13 లక్షలతో రిజర్వాయర్ ప్రహరీని ప్రారంభించారు. ఇక్కడే వీకర్ సెక్షన్ లే అవుట్ పార్కు ప్రహరీని, రూ.22.92 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. 23వ వార్డు లింగంపల్లిలో రూ.14.15 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు, రూ.16.85 లక్షలతో నిర్మించే డ్రైనేజీకి, సీసీ రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. 24వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో రూ.13.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. 24, 25 వార్డులలో రూ.11.92 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్ పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీసీ నాయకులు ముంగండి కృపానందం , వర్ధినేటి చినబాబు, మద్దిపాటి ఫణింద్ర, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, పిట్టా పద్మావతి, అహ్మదున్నీసాబేగం, దాకే అనిల్ కుమార్, పడాల శిరీష, ఎండీ షకీరాబేగం, పువ్వుల రతీదేవి, ఆరుగొల్లు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్లు ప్రారంభం

నిడదవోలు రూరల్: డిసెంబర్ 15 నుంచి జరిగే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించే క్రీడా పోటీలకు గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్లు ఎంపీడీఓ పి.శామ్యూల్ తెలిపారు. క్రికెట్, వాలీబాల్,బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులంతా డిసెంబర్ 13లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

సందడిగా ఆబోతు వెంకన్న తీర్థం





రంగురంగుల పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి వారు. స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామంలో ఆబోతు వెంకన్నబాబు తీర్థాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఏటా కార్తిక పౌర్ణమి నాడు ఈ తీర్థం నిర్వహిస్తారు. ఈ ఏడాది పౌర్ణమి ఆదివారం నుంచి ఉండడంతో రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించారు. అలివేలు మంగా పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచి స్థానికులే గాకుండా మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు, భక్తులు తరలి వచ్చి గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారికి పూజలు చేశారు. భారీగా భక్తులు రావడంతో ఆలయం వద్ద క్యూలైన్లలో రద్దీ నెలకొంది. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని ఆబోతును భక్తులు దర్శించుకుని పూజించారు. అర్చకులు పెరవలి సత్యప్రసాద్, సాయి ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం ప్రాంగణంలో వివిధ రకాల బొమ్మలు, జీళ్లు, ఖర్జూరం దుకాణాలు వెలిశాయి. అలాగే రంగుల రాట్నాలు, జెయింట్ వీల్ ఏర్పాటు చేయడంతో ఆలయ పరిసరాలన్నీ సందడిగా మారాయి. కైగాల సూర్యచంద్రరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు.


నేడు వాహనాల వేలం

దేవరపల్లి: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను మంగళవారం స్టేషన్ వద్ద బహిరంగ వేలం వేస్తున్నట్లు సీఐ డి.సుధ తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. అనంతరం మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు డీఎస్ఈఓ సమక్షంలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన సారా, అక్రమ మద్యం సీసాలను ధ్వంసం చేయనున్నట్టు ఆమె తెలిపారు.

కంసాలిపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

నిడదవోలు రూరల్: మండలంలోని కంసాలిపాలెం పంచాయతీ పరిధిలో సర్పంచ్ కొండపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి సర్పంచ్ శ్రీనివాసరావు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాభివృద్ధికి చేపట్టిన పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మలిశెట్టి వీరప్రసాద్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బెజవాడ నాగ గంగాధర్, నాయకులు కొమ్మిన వెంకటేష్, రాపోలు వెంకటేష్, కొయి శ్రీనివాస్, యర్రా తాతారావు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ దుర్గారావు బర్త్ డే



ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎమ్మెల్యే వెంకట్రావులను గజమాలతో సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

దేవరపల్లి: మండలాధ్యక్షుడు కుప్పాల వెంకట కనక దుర్గారావు జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఈ వేడుకలకు హాజరై, ఎంపీపీ కేవీకే దుర్గారావుకు శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఎంపీపీతో కలసి కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మండల పరిషత్ పాలకవర్గ సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎంపీపీ దుర్గారావు, ఎమ్మెల్యే తలారి వెంకట్రావును గజమాలతో సత్కరించారు. మండలంలోని వివిధ శాఖల ప్రభుత్వోద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు, కుల సంఘాల ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు ఎంపీపీ దుర్గారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గొల్లగూడెం వద్ద గల దివ్యాగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, అయ్యప్పస్వామి గుడిలో మాలధారులకు ఉదయం వడి(అల్పాహారం) ఏర్పాటు చేశారు.

స్పటిక లింగ దర్శనం



పెరవలి: అన్నవరప్పాడులోని ఉమా విశ్వేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో సోమవారం స్పటిక లింగం దర్శనం ఏర్పాటు చేశారు. వేలాదిగా మంది భక్తులు తరలి వచ్చారు. సుమారు కిలోమీటరు మేర జాతీయ రహదారిపై భక్తులు క్యూలో నిలబడి లింగాన్ని దర్శించుకున్నారు. ఏడాదికి మూడుసార్లు మాత్రమే స్పటిక లింగ దర్శనానికి అనుమతిస్తారు. స్పటిక లింగ దర్శనం సందర్భంగా దాత బొలిశెట్టి రామకృష్ణ సుమారు ఎనిమిది వేల మందికి అన్న సమారాధన చేశారు. సర్పంచ్ పంతం మంగతాయారు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పంతం చిన్న, పంతం నాగేశ్వరరావు, ఓసూరి బాల నాగేశ్వరరావు, కోటిపల్లి గంగన్న, యాళ్ళబండి శ్రీనివాస్, యాంతం మల్లికార్జునరావు, గుత్తుల మహాలక్ష్మి పాల్గొన్నారు.

శివోహం.. భక్తజన సందోహం



అన్నవరప్పాడులో ఉమా విశ్వేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

- ముక్కంటికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు
- భక్తి శ్రద్ధలతో కార్తిక పౌర్ణమి పూజలు
- దీపాలు వదిలిన మహిళలు



బ్రాహ్మణగూడెం నాగారమ్మ ఆలయంలో మహిళల దీపారాధన



తాళ్లపూడిలో పూజలు చేస్తున్న మహిళలు

నిడదవోలు రూరల్: కార్తిక పౌర్ణమి సందర్భంగా సోమవారం శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో కార్తిక శోభ వెల్లి విరిసింది. మండలంలోని శైవ క్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. తాడిమళ్లలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, రామలింగేశ్వరస్వామికి, కాటకోటేశ్వరంలోని ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామికి, కంసాలిపాలెంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. కాటకోటేశ్వరం ఆలయం వద్ద దాతల తోడ్పాటులో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఉనకరమిల్లిలోని ఉమాలింగేశ్వరస్వామి, సమిశ్రగూడెంలోని పర్వత వర్ధిని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు.

పెరవలి: అన్నవరప్పాడులోని ఉమా విశ్వేశ్వర స్వామికి, ఖండవల్లిలోని మార్కండేయ మృకండేయ స్వామికి, ముక్కామలలోని ఉమాసోమేశ్వరస్వామికి, కాపవరంలోని ఉమారామ లింగేశ్వరస్వామికి, తీపర్రులోని రాజరాజనరేంద్ర స్వామికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. తీపర్రులో స్వామి వారికి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, లక్ష పత్రి పూజ చేశారు. జలాశయాల్లో మహిళలు కార్తిక దీపాలు వదిలారు.

తాళ్లపూడి: వేకువ జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి శివాలయాల్లో పూజలు చేశారు. ముక్కంటికి అభిషేకాలు, పుష్పార్చనలు, కుంకుమ పూజలు, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. తాళ్లపూడిలోని పార్వతీ సహిత ఉమామహేశ్వరస్వామి, ప్రక్కిలంకలోని విశ్వేశ్వరస్వామి, అన్నదేవరపేటలోని సంగమేశ్వరస్వామి, వేగేశ్వరపురంలోని ఛాయా సోమేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకుల ఆధ్వర్యంలో సామూహిక అభిషేకాలు, గోత్ర నామాలతో పూజలు జరిగాయి. ఆలయాల్లోను, ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపారాధన చేశారు. దోష నివారణార్థం బ్రాహ్మణులకు దానాలు ఇచ్చారు. వేగేశ్వరపురంలోని గోదావరిఒడ్డునే గల రావి, మర్రిచెట్లకు పూజలు చేశారు. పెద్దేవం, బల్లిపాడు, గజ్జరం, మలకపల్లి, తాడిపూడి, రావూరుపాడు, తిరుగుడుమెట్ట తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సహస్ర దీపాలంకరణలు, జ్వాలాతోరణాలు ఏర్పాటు చేశారు.

చాగల్లు: చాగల్లు రాజరాజేశ్వరి స్వామి, చిక్కాల, కలవలపల్లి, ఊనగట్ల, మార్కొండపాడు ఉమామార్కండేయస్వామి ఆలయాల్లో కార్తిక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.బ్రాహ్మణగూడెం బాల రామలింగేశ్వర స్వామి, గ్రామదేవత నాగారమ్మ ఆలయంలో లక్ష సహస్ర నామ దీపారాధన చేశారు. జ్యోతిలింగార్చన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.